# తమాషా

"చూడండి... మావయ్యా !... మాక్కావాల్సింది పిల్లేగానీ ముల్లెకాదు. మా మిత్రుని పెళ్ళిలో మీ అమ్మాయిని చూసినప్పుడే నా మనసిచ్చాను. కన్నెపిల్ల జీవితాన్ని కసాయి కట్నంతో ముడిపెట్టక మూడు ముళ్ళ సంగతి గురించి మాట్లాడండి" బుద్ధిమంతుడిలా నచ్చ జెప్పాడు సమీర్‌కుమార్.

"మా అబ్బాయికా ఉద్యోగముందన్నయ్యా ! వాడీ లోకం లోకి రాగానే వాడి తండ్రి మరో లోకానికెళ్ళిపోయాడు. వాడికిప్పుడు మామైనా, తండ్రైనా మీరే..." జగదాంబ దీన వచనాలు మనసుల్ని కరిగించాయి.

ఇది గతం.

పెళ్ళై ఆర్నెల్లన్నా కాలేదు... అప్పుడే ఇంత మార్పా !

హీనమైన కట్నం తీసుకున్నందుకు నలుగురూ నవ్వుపోతున్నారట ! ? మతి లేని మొగుడికి గతిలేని పెళ్ళామని గేలి చేస్తున్నారట !?

కోమల మొదటిసారి పుట్టింటికెళ్ళడానికి ఒకరోజు ముందు జగదాంబ స్వయంగా కాఫీ కప్పందించింది. "చూడమ్మా ! కట్నం విషయంలో మమ్మల్నందరూ దెప్పిపొడుస్తున్నారు. స్నేహితుల మధ్య వాడు తలెత్తుకోలేక పోతున్నాడు. ఎలాగైనా మీ నాన్న నొప్పించి ఓ లక్ష రూపాయలు పట్టుకుని రామ్మా !" అనునయంగా ఆదేశించింది.

వామ్మో ! లక్షా...!... లక్ష రూపాయలా ! మానాన్న మళ్ళీ జన్మ ఎత్తి సంపాదించినా అంత కూడబెట్టలేడు. గుండె గుబగుబలాడింది. వెన్నుపూసలో సన్నని వణుకుపుట్టింది. అయినా ధైర్యం కోల్పోలేదు. "అదేమిటత్తయ్యా ! పెళ్ళయ్యే వరకూ ఒకమాట - ఆ తర్వాత మరోమాటనా ! మీరు ఆదర్శమూర్తులని మా అమ్మా నాన్న లెంతో పొంగిపోయారు. వరకట్నం దురాచారమని మీకు తెలుసు. ఎవ్వరెట్లా అనుకుంటే మీకేం ? కట్నం మేమే వద్దన్నామని చెప్పెయ్యండి. మీ పట్ల గౌరవం పెరిగి పోతుంది " నచ్చజెప్పబోయింది.

అత్తగారి పళ్ళు పటపటలాడాయి. మూతి మూడు వంకర్లు తిరిగింది. కబడ్డీ ప్లేయర్లా కళ్ళు కదిలించింది.

"అదేం కుదరదే కోడలు పిల్లా ! అట్లా అంటే మా వాడిలో ఏదో లోపముందని ఆడిపోసుకుంటారు" అని కొడుకు వైపు చూసింది - కదరా అబ్బాయ్ అన్నట్టుగా...

"ఔను గదా !" అంటూ తప్పుకున్నాడతడు.

పుట్టింట్లో వారం రోజులున్నా విషయం తండ్రి ముందు ప్రస్తావిస్తే తల్లడిల్లిపోతాడని మానుకుంది.

పుట్టింటి నుండి రాగానే...

"మేం చెప్పిన సంగతేం చేశావు కోమలా ?" ఆశగా అడిగారు అత్తగారు.

"లక్ష కాకున్నా అర లక్షన్నా తెచ్చుంటుంది." సమీర్‌కుమార్ సర్దుబాటు మాటలు.

తనలో అసహ్యం అంగలేసింది. అయినా తలవంచుకోవడం వినా మరేమీ అనలేకపోయింది. తల్లీ కొడుకుల సైగల్లో నిరాశా నిస్పృహలు వ్యక్తమైనాయి.

☆ ☆ ☆ ☆ ☆

పార్టీల్లో ఆనవాయితీగా ఓ పెగ్గు వేసుకోవడం సమీర్‌కుమార్ కో హాబీ... ఓ రోజు అర్ధరాత్రి ఏనుగు మీదెక్కి వచ్చాడు. తల్లితలుపు తీసి "ఏందిరా కంపువాసనా ?" అంటూ ముక్కు మూసుకుంది. అత్తా - కోడళ్ళు భోంచేస్తున్నారు.

"వెధవ తాగుడు... దరిద్రం మొహం..." అత్తగారి గొణుగుడు అంతా ఇంతా కాదు... తెల్లవారింది... మంచం దిగబోయిందితను. జడబట్టి లాగి జబర్దస్తీగా చెంపలందుకున్నాడు.

"రాత్రికి మీ అమ్మ తిట్లతో కడుపునిండి పోయిందనా ఈ సంతోషం ?" ఓరచూపు విసిరింది.

"మా అమ్మ నన్ను తిట్టిందా !" చెంపలొదిలేసి చేవ చచ్చిన వాడిలా లేచి కూచున్నాడు.

"ఔను... మీరు రోజూ తాగి తందనానలాడ్తూ ఇల్లు గుల్ల చేస్తున్నారట... అందుకు నేనే ప్రోత్సహిస్తున్నానట... నన్నూ మిమ్మల్ని కలిపి కడిగి పారేసింది. అమ్మో... ఎన్నితిట్లు తిట్టిందనీ... నా నోటితో చెప్పలేను బాబూ ! ఆ తిట్లతో నా మొహం వాచిపోయింది" అత్తగారి తిట్లకు మరో నాలుగు జోడించింది.

"నేను... నేను... ఇల్లు గుల్ల చేస్తున్నానా ?"

"ఏదో పాపం - పార్టీల్లో మాత్రమే తాగుతున్నారని నేనంటే పెళ్ళాం మొగుళ్ళు కూడబలుక్కుని నాటకాలాడున్నారంది. నలుగుర్నీ పిలిపించి మనల్ని ఇంటి నుండి గెంటించేస్తానంది..."

"అరె... అంత మాటందా !... అసలు దుబారా అమ్మనే చేస్తుంది... దాన ధర్మాలంటూ - తీర్థ యాత్రలంటూ - పూజా పునస్కారాలంటూ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తుంది...."

రోజూ ఆఫీసు కెళ్ళేటప్పుడు అమ్మతో చెప్పేవాడు... ఆ రోజు ముభావంగా వెళ్లిపోయాడు... సామదానోపాయాలు విఫలమై భేదోపాయం సక్సెస్ కాబోతున్నందుకు సంతోషమనిపించింది.

"ఏంది కోమలా ! వాడట్లా ఉన్నాడేందీ ?" ముక్కు మీద వేలేసుకుంది జగదాంబ.

"ఏమో ! తల్లీకొడుకుల మధ్య నేను తలదూర్చను."

"విషయమేందో సరిగ్గా చెప్పు తల్లీ !" బుజ్జగింపు.

"మీరడిగారు కాబట్టి చెబుతున్నా - పూజా పునస్కారాలకు, తీర్థయాత్రలకు మీరే బోలెడంత డబ్బు ఖర్చు చేస్తూ ఇల్లు గుల్ల చేస్తున్నారట... ఇలాగే మరికొన్ని రోజులు చేస్తే చిప్ప చేతికొస్తుందటా... చెబుతూ పోయింది.

"ఆ తాగుబోతుగాడన్ని మాటలన్నాడా ?" చిటపటలాడింది. డైలాగుల వర్షం కురిపించింది. "తండ్రిలేని పిల్లవాణ్ణి పూవులా పెంచినందుకిదా ఫలితం ? అడ్డాల నాడే బిడ్డలు కానీ గెడ్డాల నాడు బిడ్డలా !" అంటూ కంటతడి బెట్టింది.

సాయంత్రం సమీర్‌కుమార్ ఆఫీసు నుండి రాగానే నిలదీసింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి తనమీది కెగబడ్డారు.

వెంటనే పుట్టింటికెళ్ళి డబ్బు పట్టుకురమ్మని శంకెలేస్తూ గట్టి వార్నింగ్ ఇచ్చారు.

"పోస్ట్ !" కేకతో ఈలోకంలో కొచ్చింది. ఆత్రంగా ఉత్తరం విప్పి గబగబా చదివేసింది. నిరాశా నిస్పృహలతో ముకుళించుకు పోయిన ముఖారవిందము వెయ్యిరేకులుగా విచ్చుకుంది.

అప్పుడే గుడినుండి తిరిగివచ్చిన అత్తగారితో...

"మీరు కోరివిధంగా నేను మా పుట్టింటికెళ్తా ... కానీ ఒక కండిషనత్తయ్యా !" అంది.

ఆఫీసునుండి వచ్చిన సమీర్ కుమార్ క్కూడా వినిపించిందామాట. తల్లీ కొడుకులు ఆశ్చర్యంతో ముఖాలు చూసుకున్నారు.

"ఏమిటా కండిషనూ ?" కుర్చీలో కూలబడింది జగదాంబ.

"తిరిగి మూడు నెలల తర్వాత వస్తా" భర్త వైపు దృష్టి సారించింది.

"అమ్మో... మూడు నెలల పాటు ఎడబాటు భరించాలా..." వీల్లేదు... అందామనుకున్నాడు. కానీ డబ్బు తేవాలంటే మాటలా... ! మూడు నెలలు ఓపిక పడితే... అంత డబ్బు వచ్చి పడుతుంది. మొహం పంచరంగుల చిత్రమైంది...

"మూడు నెలలేమిటి ... నాలుగు నెలలైనా సరేగాని ఉట్టి చేతుల్తో మాత్రం రావద్దు..." రూలింగిచ్చింది బగదాంబ.

"లేదత్తయ్యా ! గట్టి చేతుల్తోనే వస్తాను..." హామీ ఇచ్చింది.

★ ★ ★ ★ ★

"బాగున్నారా అత్తయ్యా !"

ఆటో దిగి సూటుకేసుతో వస్తున్న కోడల్ని ఎగాదిగా చూస్తోంది జగదాంబ. కోమల మొహమ్మీద కొత్త వెలుగు తాండవమాడుతోంది. పెదాల మీద చిరునవ్వు చిందులేస్తుంది.

తప్పకుండా డబ్బుతో వచ్చుంటుంది. "ఎంత తెచ్చావమ్మా !..." నోటిదాకా వచ్చిన మాటల్ని బలవంతంగా ఆపుకుంది.

"ఆ... ఆ... మీ అమ్మా - నాన్నలు కులాసానా ?" అడిగేసింది అరువుదెచ్చుకున్న సంతోషంతో...

సూటుకేసు గదిలో ఉంచి స్నానానికెళుతున్న కోడలు మొహం పున్నమి చందమామలా కనబడింది. మూన్నెళ్ళల్లో వెన్నముద్దలా తయారైందే...!

కాఫీ కప్పుతో గదిలోకొచ్చిన భార్య కంటబడగానే సమీర్‌లో విజయగర్వం పురివిప్పింది. కాఫీ కప్పు టీపాయ్ మీదుంచి "తీసుకొండి..." అంది కళ్ళతో... కాటుక కళ్ళల్లో మూడు నెలల పాటు కాపురముంటున్న చిలిపిదనం రెక్కలు విప్పుకుంది... భర్త చెక్కిలిమీద చిటికేసింది.

అజంతా సుందరిలా తిరిగొచ్చిన అందాల దేవతను అమాంతం కౌగిట్లో బంధించాలనీ, చెక్కిళ్ళను తడిపెయ్యాలని... కానీ అవన్నీ చేస్తే డబ్బు సంగతి ప్రస్తావనకు రాదు... కదిలే కోరికలను నిర్దాక్షిణ్యంగా అదిమిపెట్టక తప్పలేదతనికి.

"మూన్నెల్లెట్లా గడిపావు కోమలా ?"

"మన సమస్య పరిష్కారం కోసం అహరహం కృషి చేశానండీ..."

"ఎంత వరకు సాధించావు ?"

"సెంట్ పర్సెంట్." కనుబొమ్మ లెగిరిపడినై....

ఆనందాన్ని పట్టలేక "ముఖం కడుక్కొనొస్తా" నని వెళ్ళి తల్లి చెవిలో వేశాడు... రెండు మొహాలు మతాబాల్లా వెలిగాయి.

ఉదయం భర్త ఆఫీసుకు తయారవుతూంటే దగ్గరుండి అన్నీ అందించింది కోమల... వంటింట్లోంచి కొడుక్కి సైగ చేసింది జగదాంబ.

"అమ్మా !..." పిలిచాడు తల్లిని...

"ఏమిట్రా ?"... కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది.

"కొత్త కాలనీలో మనం కొనబోయే ప్లాటు ఖరీదు ఎంతనటా ?" విషయ ప్రస్తావనకు నాందీ వచనం పలికాడు.

"యాభై వేల్రా?"

"అయితే మన కోమల తెచ్చిన డబ్బుల్లోంచి ముందు ప్లాటు కొనేద్దాం..."

"సరే... మీ ఇష్టం రా... పాట్లు పడినా... ప్లాటు కొన్నా అన్నీ మీ కోసమే కదా !... కదమ్మా..' ' అంటూ కోడలి వైపు చూసింది.

కోమల గుండెల్లో కోటి గుండ్రాళ్ళు దొర్లాయి... ఇప్పుడేం చెయ్యాలి ? ఎలా ప్రొసీడవ్వాలి?... మూడు నెలల శిక్షణ మదిలో మెదిలింది... గుండెదడ ఆగి ధైర్యం చోటు చేసుకుంది.

"ఏదీ కోమలా ... ఆడబ్బిలా పట్రా... ఆఫీసు కెళ్తూ డబ్బు కట్టేస్తా... మధ్యాహ్నం సెలవు బెట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు.

"ఏ డబ్బూ... ఏం రిజిస్ట్రేషనూ ?... యుద్ధ రంగానికి దిగిన సిపాయిలా గంభీరమైంది కోమల గొంతు.

"జోకులొద్దు ... కోమలా !"

"జోకులేమిటీ ?"

"నువ్వూ.. నువ్వు..."

"మూన్నెళ్ళు పుట్టింట్లో ఉండివచ్చా..."

"అంటే... డబ్బు తేలేదా ?..." జగదాంబ కనురెప్పలు కిటికి రెక్కల్లా టపటపలాడాయి. నోరు మెయిన్ గేటులా తెరుచుకుంది.

"ఏ డబ్బూ... ?"

"అదే... మీ నాన్న దగ్గర పట్టుకురమ్మన్నాం గదా !... లక్షకాకున్నా కనీసం యాభైవేలతో నన్నా మా పరువు ప్రతిష్టలు..." జగదాంబ చేతులు గాల్లో ఆడుతున్నాయి. వాటిని వాటంగా పట్టేసింది కోమల.

"పొండత్తయ్యా ! ఇప్పుడు మన ప్రతిష్టల కేమైందనీ !" నవ్వింది.

అదిరి పడింది జగదాంబ. ఖంగుతిన్నాడు సమీర్ కుమార్. కోడలు చేతుల్లో అత్త చేతులు పచ్చడైపోతున్నాయి.

"ఏయ్ విడువూ.. నా చేతులు విడువే..." కోపం నషాలానికంటింది. కానీ చేతులు మరింత పచ్చడైపోతున్నాయి. ఏడుపొస్తుంది. "అబ్బో !... అమ్మో... ! నీకు దండం బెడ్తా విడువమ్మా...!"

వదిలేసి భర్తవైపు తిరిగింది.

"ఏయ్ నాటకాలాడుతున్నావా ?..." సమీర్‌కుమార్ గొంతు తారాస్థాయికి చేరుకుంది.

"నాటకాలా... నా కెందుకూ ? నేనేమన్నా మాట తప్పానా లేక మూట కావాలన్నానా?"

మగపురుషుని అహం దెబ్బతింది. రోషం పొంగింది.

"నీ యవ్వ ! యాభైవేలు తెచ్చావనుకుంటే..." కుడిచెయ్యి పైకి లేవబోయింది. ఆ చెయ్యిని ఎడమ చేత్తో అలవోకగా పట్టితిప్పేసింది కోమల.... చెయ్యి విరిగినట్టనిపించింది.

దంగైపోయాడు... "నిన్ను పుట్టింటికి పంపించింది నీ చిలుక పలుకులు వినేందుక్కాదే బద్మాష్" చెంప ఛెళ్ళు మనిపించాలని గాల్లోకి లేచిన కుడి చెయ్యి పెళ్ళాం కుడి చేతికి చిక్కింది.

"వదులూ... చేతులొదులూ !..." గింజుకుంటున్నాడు. అసహనం - ఆక్రోశం పెనుగులాడిస్తున్నాయి. కోమల చేతులు క్షణ క్షణానికి ఉక్కు సంకెళ్ళైపోతున్నై.

"అరె... విడువుమంటే..." శక్తినంతా కూడగట్టుకుని లాక్కోబోయాడు. లాభం లేదు సింహం చేతిలో చిట్టెలుకలా గిజగిజ లాడుతున్నాడు. అతని రెండు కాళ్ళ మధ్య కోమల కుడి కాలు క్షణ కాలం డాన్సు చేసింది. చేతులు వదిలేసింది. మొదలు నరికిన చెట్టులా దభేలున పడిపోయాడు. అయిదు నిమిషాలు ఆయాసపడి లేచికూచున్నాడు. భార్య కళ్ళల్లోకి దృష్టి సాగించాడు.

రెప్పవేయని కళ్ళు, పళ్ళ మధ్య నలిగి పోతున్న కింది పెదవి... విప్పారిన ఎర్రబంతి పూవులాగైన మొహం... అర చేతులంతైన కళ్ళు అదరగొడుతున్నాయి.

తల్లీ కొడుకుల చూపులు సీరియస్‌గా మాట్లాడుకున్నాయి. ప్లేటు మారక పోతే పుట్టగతులుండేట్టు లేవు.

"ఓసి కోమాలా !" అతికించుకున్న చిరునవ్వు అతని పెదాలమీదికొచ్చింది.

"మేమేదో తమాషాకంటే నువ్వింత సీరియస్‌గా తీసుకుంటావా ? అమ్మో... కాస్త ఆసరాపట్టు..." చెయ్యందించాడు. పెళ్ళాం ఆసరాతో లేచి ఆయాసంతో మూలుగుతూ మంచమ్మీద ఒరిగాడు.

కోడలి చేతివాటం రుచి చూసిన జగదాంబ తడిసిన పిండిలా మారిన చేతుల్ని కొంగులో దాచుకుంది. నుదుటి చెమట అద్దుకునే బలం కూడా లేదు. "మావాడేదో తమాషా చేసి చూస్తానన్నాడు. నేను సరేనన్నాను. కానీ ఇంత పనౌతుందనుకోలేదమ్మా !" వణికిపోతూ కొడుకు తల పక్కన కూచుంది.

కోమల గలగలా నవ్వింది.

"నేను కూడా ఓ తమాషా చేసి చూసానంతే అత్తయ్యా !" అంటూ సమీర్‌కుమార్ బుగ్గలు నిమిరింది.

చివరి అస్త్రం దివ్యంగా పంజేసినందుకు - ఉత్తరం రాసి పిలిపించుకుని కరాటే నేర్పించిన స్నేహితురాలు నీరజకు మనసు లోనే నీరాజనాలు అర్పించింది.

**మహిళ, 'ఆంధ్రప్రభ' అనుబంధం.... 25-2-1999**